# మన(సు)లో మాట

విద్యార్థులకు క్రొత్త సంవత్సరము మొదలైన సందర్భములో సంఘమిత్ర శుభాకాంక్షలను తెలియజేస్తోంది. ఈ సంవత్సరము విజ్ఞాన సముపార్జనలో విశేషముగా రాణించి, ఉన్నత శిఖరములకు చేరుకోవాలని విద్యార్థులకు శుభాకాంక్షలను అందజేస్తున్నది. ఈసారి కొన్ని అనివార్య కారణములవలన సంఘమిత్ర అతి తక్కువ శీర్షికలతో విడుదల చేయడం జరిగింది. వచ్చేసంచిక మళ్ళీ అన్ని అంశములతో వెలువడుతుంది.

మార్చి నెలలో సెయింట్‌లూయిస్‌లో జరిగిన గణిత సదస్సు మరియు మేధావధానముల తరువాత చాలామంది వేసవిలో తరగతుల నిర్వాహణ గురించి అడగడం జరిగింది. భారతదేశ (ఇండియా) ప్రయాణము కారణముగా ఈసారి వసంత మాసపు సెలవులలోనే (లఘు వ్యవధిలో) తరగతులు నిర్వహించడం జరిగింది. ప్రప్రథమముగా కాలిఫోర్నియాలో నిర్వహించబడిన తరగతులకు విశేష స్పందన లభించడం ముదావహం. శ్రీనివాసరామానుజన్ మేథమేటిక్స్, సంఘమిత్ర ఆధ్వర్యములో, వివిధ వయస్సులవారికి, సన్నీవేల్, కూపర్టినో మొదలైన ప్రదేశములలో తరగతులు నిర్వహించి, వారి ఆదరణ చూరగొంది. ఈ కార్యక్రమ నిర్వాహణకు తోడ్పడిన మిత్రులందరికి సంఘమిత్ర ధన్యవాదములు తెలియజేస్తున్నది.

చాలామంది పాఠకులు ముఖచిత్రము బాగుందని, 'జనపథం - జనపదం', 'ఆచారములు - అంతరార్థములు', సామెతకథలు, సమస్యల'తోరణం' మొదలైన అంశములు బాగున్నాయని తెలియజేసారు. చరిత్రకెక్కిన చరితార్థులు, నా స్మృతి పథంలో ఒక రోజు వంటి అంశములను ప్రతిసారీ ప్రచురించమని చాలామంది అడగడం సమంజసమే! కాని ఆ అంశములగురించి అరుదుగా ఉత్తరములు అందుతున్నాయి. వీలునుబట్టి ప్రతి సంచికలోనూ ఈ అంశములను ప్రచురించే ప్రయత్నము చేస్తాము.

సంఘమిత్ర చేస్తున్నపని సముద్రపు ఒడ్డున ఒక ఇసుక రేణువుమాదిరి ప్రయత్నం. మన చుట్టుప్రక్కల ఎంతోమంది విజ్ఞానమును అందించగల మేధావులు ఉన్నారు. వారు తలచుకుంటే ప్రపంచము రూపే మార్చివేయగలరు. ఇక్కడ విజ్ఞానమును పంచేవారు, పొందుతున్నవారు ఎంతో సఖ్యతతో మెలగుతూ, ఒకరిపై మరొకరు అభిమానమును కలిగి ఉండాలి. ఈ పనిని ఒక అదృష్టముగా, పెద్దల దీవెనగా, భక్తితో చేస్తే ఇరు వర్గములవారు ఎంతో ఉన్నతిని పొందగలరు. విజ్ఞానమును పొందేవిషయములో వయస్సుతో నిమిత్తం ఉండదు. ఒక్కొక్కసారి ఏడు సంవత్సరముల బాలుడుకూడా నలభై సంవత్సరముల వ్యక్తి కంటే ఎక్కువ తెలిసినవాడై ఉండవచ్చు. అహంకారమును ప్రక్కన పెట్టి, నలభై సంవత్సరముల వ్యక్తి అయినా ఎంతో నేర్చుకోవచ్చు. నేర్చుకునేవారికి ముఖ్యముగా ఉండవలసిన లక్షణము ఎదుటివారు చెప్పే విషయమును అనుమానములేకుండా వినడము. మీరు మీ ఆలోచనలను పాఠకులతో పంచుకోవాలని అనుకుంటే ainapura@yahoo.com కి ఈ-మెయిలు పంపండి.

మళ్ళీ అక్టోబరు సంచికలో కలుద్దామా! అంతవరకు సెలవు. అభినందనలతో ...

సంఘమిత్ర సంపాదక వర్గం.